ప్రజాశక్తి
ఆదివారం 27 నవంబర్ 2022
5
పార్వతీపురం మన్యం

30న జిల్లా స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సిఎం పేరున రూ.50 లక్షల నగదు బహుమతి రాష్ట్ర స్థాయి కబడ్డీ, వాలీ బాల్ (స్త్రీ పురుషులకు), క్రికెట్ (పురుషులకు) పోటీలను జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాస్థాయిలో కబడ్డీ, వాలీబాల్ (స్త్రీ పురుషులకు), క్రికెట్ (పురుషులకు) క్రీడా పోటీలను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యాన ఈనెల 30న స్థానిక ఆర్‌సిఎం స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పై పోటీల్లో కురుపాం, సాలూరు, పార్వతీపురం, పాలకొండ నియోజకవర్గాల్లో జరిగిన క్రీడ ఎంపికల్లో ఎంపికైన టీములు మాత్రమే ఆధార్, రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలతో ఈనెల 30న ఉదయం 8గంటలకు హాజరు కావాలన్నారు.

వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యం

రాష్ట్ర వ్యవసాయ మిషన్ ఉపాధ్యక్షులు నాగిరెడ్డి

ప్రజాశక్తి - కలెక్టరేట్

రాష్ట్రంలో వ్యవసాయానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని రాష్ట్ర వ్యవసాయ మిషన్ ఉపాధ్యక్షులు ఎంవిఎస్ నాగిరెడ్డి అన్నారు. జిల్లా పర్యటనకు శనివారం విచ్చేసిన ఆయన స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన వ్యవసాయ, అనుబంధ రంగాల భాగస్వామ్య పక్షాల ముఖాముఖి చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మిషన్ ఉన్నత స్థాయి సలహాలను ప్రభుత్వానికి అందిస్తున్నదన్నారు. ఈ జిల్లా సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేసే అవకాశం ఎక్కువగా ఉన్న ప్రాంతమన్నారు. ధాన్యంలో నాణ్యత ఉంటే సమస్య ఉండదని ఆయన పేర్కొన్నారు. గత మూడేళ్లుగాఆయిల్ పామ్, మామిడి, జీడి తదితర పంటలు ముందు వరుసలో ఉన్నాయని వివరించారు. చిరు ధాన్యాలను గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా పండిస్తున్నారని చెప్పారు. మార్కెట్ కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పసుపు, టమాట, అరటికి కూడా మద్దతు ధరను రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నదని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో 50 గిడ్డంగులు మంజూరుకు ప్రతిపాదన ఉందని ఆయన తెలిపారు. అనంతరం జిల్లాలో సమస్యలు ఉంటే వ్రాతపూర్వకంగా తెలియజేయాలని ఆయన సూచించారు.

అరకు ఎంపి జి.మాధవి మాట్లాడుతూ స్థానిక రైతులకు ఆయిల్ పామ్ పట్ల పూర్తి అవగాహన కల్పించాలని కోరారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ఐకెపిలో కొంత వెసులుబాటు కల్పించాలని సూచించారు. పంట మార్పిడి విధానంలో భాగంగా చెరకు సాగుకు ప్రభుత్వం కొంత ప్రోత్సాహకం అందించాలని కోరారు. తద్వారా వరి పంట నుండి ఇతర పంటలకు మారగలరని చెప్పారు. పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి మాట్లాడుతూ పాలకొండ ప్రాంతంలో ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మైదాన ప్రాంత గిరిజనులకు కూడా 90 శాతం రాయితీతో విత్తనాలు అందించాలని సూచించారు. భామినిలో పత్తి గిడ్డంగి సౌకర్యం కల్పించాలని ఆమె కోరారు. ఏనుగుల సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ ధాన్యం విక్రయంలో రైతులు ఏ మాత్రం ఆధైర్యపడవద్దని సూచించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వాకాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాకు కావాల్సిన వనరులు సమకూర్చాలని అన్నారు. జిల్లాలో శత శాతం ఇ క్రాప్ నమోదైందన్నారు. దళారీలను రైతులు ఆశ్రయించొద్దని కోరారు. జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ వరి పండించే జిల్లాల్లో ఈ జిల్లా ముందు వరుసలో ఉందన్నారు. వ్యవసాయానికి మంచి భవిష్యత్తు ఉందని చెప్పారు. ఈ ఏడాది 3.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా ఉందని, ఇందులో 66 శాతం సేకరించేందుకు లక్ష్యంగా నిర్ణయించామని చెప్పారు. ధాన్యం కొనుగోలు శుక్ర వారం ప్రారంభించామని, రాబోయే రెండు, మూడు నెలల్లో కొనుగోలుకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో ఏనుగుల వల్ల పంట నష్టం జరుగుతుందని, ముఖ్య మంత్రి దృష్టిలో పెట్టామని తెలిపారు. డాక్టర్ డి.రామ్మోహనరావు మాట్లాడుతూ జిల్లా ఆయిల్ పామ్ ఉత్తమమైన ప్రాంతమని అన్నారు. తోటపల్లి ప్రాంతం అనుకూలమని ఆయన చెప్పారు. వివిధ మండలాల నుంచి పాల్గొన్న వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు, సభ్యులు, రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు మిల్లర్ల ప్రమేయం లేకుండా చేపట్టాలని, మిల్లర్లు సిండికేట్ గా మారి రైతులను మోసం చేస్తున్నారని వివరించారు. ఈ అన్యాయాన్ని అడ్డుకోవాలని సూచించారు. ఏనుగుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, రైతులకు చిన్న యంత్ర పరికరాలు అందించాలని, గిరిజనులకు అల్లం, పసుపు విత్తనాలు అందించాలని కోరారు. కొమరాడ మండలంలో జంఝావతి ప్రాజెక్టు హై లెవెల్ కెనాల్‌కు నీటి సరఫరా చేయక పంటలు నష్టపోవడం జరుగుతుందని తెలిపారు. ఉద్యానవన పంటలకు ప్రోత్సాహం అందించాలని కోరారు. నాలుగు నియోజక వర్గాల్లో చెరకు రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. అనంతరం జిల్లా అధికారులు శాఖా పరంగా అమలు చేస్తున్న పథకాలను వివరించారు. సమావేశంలో డిసిఎంఎస్ అధ్యక్షులు అవనాపు భావన, వ్యవసాయ మిషన్ సభ్యులు రామారావు, గొండు రఘురాం, శాశ్వత కార్యనిర్వాహణ సభ్యులు డాక్టర్ చంద్ర శేఖర రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ జెడి కె.రాబర్ట్‌పాల్, జిల్లా పశుసంవర్ధక జెడి ఎ.ఈశ్వరరావు, జిల్లా ఉద్యాన అధికారి కెబిఎస్ఎన్ రెడ్డి, ఎపిఎంఐపి పిడి ఎల్.శ్రీనివాస రావు, జిల్లా సహకార అధికారి సన్యాసి నాయుడు, జిల్లా మత్స్య అధికారి వేమూరి తిరుపతయ్య, శాస్త్రవేత్తలు డా.సీతారాం, డా. శ్రీనివాస రాజు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, డిఎస్ఒ కె.వి.ఎల్.ఎన్ మూర్తి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ మిషన్ ఉపాధ్యక్షులు నాగిరెడ్డి

పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపం

ఉత్తరాంధ్ర అభివృద్ధికి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

ప్రజాశక్తి - కలెక్టరేట్

కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ పాలన ప్రజలకు శాపంగా మారిందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా ప్రత్యేక హెూదా సాధన సమితి ఆధ్వర్యంలో శనివారం స్థానిక సుందరయ్య భవనంలో వామపక్ష, రైతు, కార్మిక, విద్యార్థి, యువజన ప్రజాసంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగనాయుడు అధ్యక్షత ఈ సమావేశంలో అజశర్మ మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం 2014లో ఉమ్మడి రాష్ట్రాన్ని రెండు ముక్కలుగా చేసి ఆంధ్ర ప్రజల్ని నట్టింట ముంచారని, తీవ్రమైన ద్రోహం వాటిలిందని మండిపడ్డారు. 2014లో చేపట్టిన విభజన చట్టాన్ని 2020లో పూర్తి చేయాలని చట్ట నివేదికలో కూడా పొందుపర్చారని, కానీ నేటికీ ప్రారంభం కూడా జరగకపోవడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. వెనకబడిన ఉత్తరాంధ్రకు, రాయలసీమ ప్రాంతాలకు కేటాయించిన రూ.100 కోట్లు నిధులు ప్రజాప్రతినిధులు, ఉన్నత అధికారులు స్థానిక అవసరాలకు నిధులను దుర్వినియోగం చేశారని, ఈ విషయం 2005 సమాచార హక్కు చట్టం ద్వారా బయటపడిందన్నారు. 2019 వరకు రైల్వే జోన్ విషయాన్ని పూర్తిగా మర్చిపోయి సార్వత్రిక ఎన్నికల సందర్భంలో మళ్లీ తెరపైకి తీసుకువచ్చి అధికారం తర్వాత మళ్లీ దాన్ని పక్కదారి మళ్లించారని తెలిపారు. గిరిజన, పెట్రోల్ యూనివర్సిటీ నిర్మాణానికి స్థల సేకరణకు ఆరేళ్లయినా నేటికీ నిర్దిష్ట కేంద్రం చేపట్టకపోవడం గిరిజనుల పట్ల ప్రభుత్వం ఆడుతున్న కపట నాటకం అర్థమవుతుందని అన్నారు. ప్రత్యేక హెూదా పిడికెడు మట్టి, చెంబుడు నీళ్లతో మోడీ ప్రభుత్వం రాష్ట్ర వైపిపి, టిడిపి నోళ్లను మూసివేసిందన్నారు. ప్రతిపక్ష టిడిపి, జనసేన మోడీ ముందు తందానా అని రాగం పలుకుతూ ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసేలా ప్రసంగాలు చేపడుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో మోడీ పర్యటన రాజకీయ పర్యటనగా మారింది తప్ప విభజన హామీలు అమలు కోసం తన ప్రసంగంలో లేకపోవడం రాష్ట్ర ప్రజలకు మోసం చేసినట్లేనని అన్నారు. కావున ఎపికి ప్రత్యేక హెూదా, విభజన హామీలు అమలు చేయాలని, వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రత్యేక పేకేజీ ఇవ్వాలని, విశాఖ రైల్వే జోన్ ఇవ్వాలని, గిరిజన యూనివర్సిటీ నిర్మించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు రెడ్డి వేణు, కె.మన్మధరావు, భాస్కరరావు (సిపిఎంఎల్ లిబరేషన్), జి.వెంకటరమణ (సిఐటియు), దుర్గారావు, ఎం.గౌరినాయుడు (ఎఐటియుసి), పి.రాజశేఖర్ (ఎస్ఎఫ్ఐ), కె.రాజు (డివైఎఫ్ఐ), కె.రామస్వామి, ఎం.వెంకటరమణ (గిరిజన సంఘం), తదితరులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న అజశర్మ

పన్నుల వసూళ్లపై దృష్టి : మున్సిపల్ ఆర్‌డి

సాలూరు : మున్సిపాలిటీలో పన్నుల వసూళ్లపై సిబ్బంది దృష్టి సారించాలని మున్సిపల్ ఆర్‌డి జి.నాగరాజు కోరారు. శనివారం మున్సిపల్ డంపింగ్ యార్డ్‌ను ఆయన పరిశీలించిన తర్వాత పలు సూచనలు చేశారు. పన్నుల వసూలు వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగుపర్చాలని శానిటరీ సిబ్బందికి సూచించారు. డంపింగ్ యార్డ్‌లో చెత్త నుంచి ఎరువు తయారు చేయు విధానం గురించి మున్సిపల్ కమిషనర్ హెచ్ శంకరరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ మురళీధర్‌ను అడిగి తెలుసుకున్నారు.

చెత్త నుంచి ఎరువు తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డి నాగరాజు

పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధాకుమారి, కౌన్సిలర్ ప్రతినిధి రమణ

సబ్‌కలెక్టర్ సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

పట్టణంలో శనివారం సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్ సుడిగాలి పర్యటన చేపట్టారు. నాగవంశపువీధి, బాయిగట్టువీధి, ఏలాం జంక్షన్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణపై దృష్టిపెట్టారు. పారిశుధ్య పనులపై ఆరా తీశారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం చూపరాదని నగర పంచాయతీ సిబ్బందిని హెచ్చరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పారిశుధ్య నిర్వహపై దృష్టిపెట్టాలి

పారిశుధ్య నిర్వహణపై దృష్టిపెట్టాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి అన్నారు. పట్టణంలోని 15వ వార్డు పరిధిలోని పలు వీధుల్లో శనివారం ఆమె పర్యటించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యంపై దృష్టిపెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ, తాగునీరు, వీధిదీపాలు సమస్యలు లేకుండా చూస్తానన్నారు. ఆమె వెంట వైసిపి నాయకులు, 15వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి కడగల రమణ, మరియదాసు తదితరులున్నారు.

ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ధాన్యం నూర్పిడిలు ప్రారంభమై 15రోజులు కావస్తున్నా ఇంకా కొనుగోలు చేయకపోవడం అన్యాయమని, వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు డిమాండ్ చేశారు. మండలంలోని అడ్డాపుశిల ఆర్‌బికె వద్ద రైతులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్‌బికెల ద్వారా వారంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామని ప్రభుత్వం, వ్యవసాధికారులు ప్రకటించి 15రోజులు గడుస్తున్నా నేటికీ ప్రారంభించకపోవడంతో కళ్లాల్లోనే నూర్పిడి చేసిన ధాన్యం మగ్గుతున్నాయని అన్నారు. యంత్రాలతో నూర్పిడి చేసుకున్న రైతులు ధాన్యం అమ్ముకోవాలో, ఇంటికి తీసుకువెళ్లి దాచుకోవాలో తెలియని పరిస్థితి ఎదుర్కొంటు న్నారని, ఈలోగా తుఫాన్ హెచ్చరికలతో వారు తీవ్ర ఆందోళనకు లోనవుతున్నారని అన్నారు. ఇంత జరుగుతున్నా మిల్లర్ల దగ్గర నుంచి బ్యాంకు గ్యారెంటీలు తీసుకోకపోవడం చూస్తుంటే ధాన్యం కోనుగోలులో అధికారులు నిర్లక్ష్యం అర్థమవుతుందని అన్నారు. ఈ నెలాఖరులోగా ధాన్యం కొనుగోలు చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఆర్‌బికెల దగ్గర ఆందోళనలు ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమం పలువురు రైతులు పాల్గొన్నారు.

కొమరాడ : ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేయాలని ఎపి రైతు, వ్యవసాయ కార్మికసంఘాలు, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం ఆర్తాం వద్ద అంతర్‌రాష్ట్ర రహదారి పక్కన నూర్చిన ధాన్యాన్ని ఎ.ఉపేంద్ర, కొల్లి సాంబమూర్తి, రెడ్డి శివున్నాయుడు, సిహెచ్ లక్ష్మం పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది రైతు నుండి ప్రతి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేసి ఆదుకుంటామని చెప్పినప్పటికీ నేటికీ ఆ దిశగా నియోజకవర్గం పరిధిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదన్నారు. ఇప్పటికే కొంతమంది రైతులు సేకరించిన ధాన్యం ఎవరికి అమ్ముకోవాలో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నారన్నారు. ఒకపక్క వర్షం, మరోవైపు ఏనుగుల భయంతో పండిన పంటను ఎక్కడ దాచుకోవాలో తెలియని పరిస్థితుల్లో రైతులు ఉన్నారన్నారు. తక్షణమే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి, రైతులను ఆదుకోవాలని కోరారు. లేకుంటే కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఆర్‌బికె వద్ద ఆందోళన చేస్తున్న రైతులు, రైతు సంఘం నాయకులు

నిబద్ధతతో పనిచేయండి

ప్రజాశక్తి - కలెక్టరేట్

సచివాలయ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని డ్వామా పీడీ, గ్రామ వార్డు, సచివాలయాల ప్రత్యేక అధికారి కె.రామచంద్ర రావు అన్నారు. శనివారం స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర మందిరంలో గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా సమన్వయకర్త వి.చిట్టిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలాలు, సచివాలయాల వారీగా సచివాలయ సర్వీసులు, హాజరు, స్పందన, రికార్డుల నిర్వహణ, తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులంతా సమన్వయంతో జిల్లాను అన్ని అంశాల్లో ప్రథమ స్థానంలో నిలబెట్టాలని సూచించారు. యూనిఫాం తప్పక ధరించాలని, హాజరు, స్పందన, నిర్వహణ, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వంటి నిబంధనలను తప్పక పాటించాలని సూచించారు. ప్రజలతో మమేకమై సచివాలయ సర్వీసులు పెంచాలన్నారు సచివాలయాల్లో ఆధార్ సేవలపై ప్రజలకు అవగాహన పెంపొందించాలన్నారు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిఎల్‌డిఒలు వివి గోపాలకృష్ణ, చంద్రమ్మ, ఎపిటి ఆన్లైన్ వి.వీరరాజేష్, ఎడిసి ప్రహ్లాద్ కుమార్, ఎస్‌బిసిసి వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిని అందజేస్తున్న టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

జగన్‌ది అరాచక పాలన

టిడిపి ఆధ్వర్యాన పలుచోట్ల అంబేద్కర్ విగ్రహానికి వినతులు

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి అన్నారు. శనివారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆమె టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్ దేవ్‌తో కలిసి పట్టణం లోని పెదహరిజనపేటలో అంబేద్కర్ విగ్రహానికి వినతి అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎపి రాజ్యాంగ బద్ధంగా వైసిపి ప్రభుత్వం పాలించడం లేదన్నారు. ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసులు వైసిపి నాయకుల సేవల్లో మునిగి తేలుతున్నారని ఆరోపించారు. ప్రజలు ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని సంధ్యారాణి చెప్పారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతి రావు, మండల అధ్యక్షుడు ఆముదాల పరమేష్, పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : రాష్ట్రంలో ఈ మూడేళ్లలో వైసిపి పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యమైందని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం గుమ్మలక్ష్మీపురంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి వినతి పత్రం అందించారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ప్రకారం సిద్ధించిన హక్కులను ఈ ప్రభుత్వం హరించివేస్తుందని అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం పోయి రాజారెడ్డి రాజ్యాంగం అమలవుతుందని, ఈ రాష్ట్రానికి ఇదేమి ఖర్మ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు,నాయకులు చిన్నరావు, అడ్డాకుల నరేష్, జానకి, తదితరులు ఉన్నారు.

పార్వతీపురంరూరల్ : వైఎస్ జగన్‌మోహనరెడ్డి అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లతో రాష్ట్రంలో రాజ్యాంగం అనేది నవ్వుల పాలు అవుతుందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శనివారం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులుతో అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్రంలో రాజ్యాంగం సక్రమంగా అమలు జరగాలని కోరుతూ వినతిని అందజేశారు. కార్యక్రమంలో పట్టణ, మండలపార్టీ అధ్యక్షులు జి. రవికుమార్, దొగ్గ మోహనరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ సమావేశం

బలిజిపేట : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో శనివారం ఉపాధి హామీ అమలుపై సామాజిక తనిఖీ ప్రజావేదిక ఎంపిపి నాగమణి అధ్యక్షతన నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద 2020-21, 2021-22 సంవత్సరాల్లో ఖర్చుపెట్టిన రూ.42 కోట్ల నిధులపై ప్రజావేదికను అధికారులు నిర్వహించారు. మండలంలోని 24 గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులు, సచివాలయం ఉద్యోగులు ఈ వివరాలను ప్రజావేదికలో వెల్లడించారు. 2020-2021లో మొత్తం 596 పనులు చేపట్టినట్లు అధికారులు తెలియజేశారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 708 పనులు చేపట్టినట్లు చెప్పారు. అన్ని వివరాలను పరిశీలించి ఎక్కడైనా లోపం ఉంటే వాటిని త్వరలోనే సరిదిద్దుతామని అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి రవి కుమార్, ప్రిసైడింగ్ ఆఫీసర్ శ్రీహరి రావు, డీవీవో రవీంద్రనాథ్, ఎంపీడీవో భాను మూర్తి, ఏపీవోలు శ్రీనివాస రావు, కేశవరావు, నాయకులు జగన్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

1020 సారా ప్యాకెట్లు పట్టివేత

పాచిపెంట: మండలంలోని పద్మాపురం జంక్షన్ వద్ద పాచిపెంటకు చెందిన సామ వీరస్వామి నుంచి 1020 నాటుసారా ప్యాకెట్లు శనివారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఎంవి రమణ తెలిపారు. నాటుసారాతో పాటు స్కూటీను పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు.

నిందితుడ్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు

గోనె సంచుల కొరత పాలకుల పుణ్యమే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గత కొన్నేళ్లగా ధాన్యం కొనుగోలు సీజన్‌లో గోనె సంచుల గోల ఎక్కువగా వినిపిస్తోంది. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అక్కడక్కడ ధాన్యం కొనుగోళ్లు కూడా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది ఉమ్మడి విజయనగరం జిల్లాలో 4.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికార యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికితోడు పారదర్శకత పేరుతో కొనుగోలు ప్రక్రియను మిల్లర్లతో సంబంధం లేకుండా చేసిన విషయం విధితమే. ఈనేపథ్యంలో మిల్లర్ల వద్దవున్న గోనె సంచులను అంత సులువుగా రైతులకు ఇచ్చే పరిస్థితి ఉండబోదు. ఒకవేళ ఇచ్చినా అవి ఏమూలకూ సరిపోని పరిస్థితి. ఈ నేపథ్యంలో గోనె సంచుల కొరతను ఎలా అధిగమించాలన్న దానిపై గత మంగళవారం జరిగిన జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో సుదీర్ఘమైన చర్చేసాగింది. గోనె సంచులు అందుబాటులో ఉంచకపోతే రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందంటూ బొబ్బిలి ఎమ్మెల్యే మొసలి కన్నీరు కార్చారు. కానీ, ఆయన వైఖరి వల్ల ఏకంగా జ్యూట్ ఉత్పత్తులు చేసే పరిశ్రమ ఆయన ఇలాకాలో మూతపడిపోయిందన్న విషయాన్ని ప్రజలు గమనించలేరను కున్నారో ఏమో...! ఈ మాటకొస్తే జిల్లా గోనె సంచులు, వాటి తమయారీకి అవరమైన నూలుపోగులు తయారీకి పుట్టినిల్లు. ఇందుకు కారణం లేకపోలేదు.

ఉత్తరాంధ్ర నేలలు గోగు సాగుకు ఎంతో అనుకూలం. 1990నాటికి విజయనగరం జిల్లాలో 57వేల ఎకరాల్లో గోగు సాగయ్యేది. గోగు నారను జ్యూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన ప్రభుత్వం కొనుగోలు చేసేది. ఇప్పటికీ రీజనల్ ఆఫీస్ విజయనగరంలో ఉంది. అప్పట్లో గోగు నార కొనుగోలుకు గ్యారెంటీ ఉండడంతో రైతులు విరివిరిగా సాగుచేసేవారు. దీంతో, మిల్లులు వేలాది మంది కార్మికులతో కళకళలాడేవి. అందువల్లే ఉమ్మడి విజయనగరం జిల్లాలో

ఎక్కువగా జ్యూట్‌మిల్లులు ఆవిర్భవించాయి. జనపనార, గోగు (మెస్తా) కలిపి జ్యూట్ ఉత్పత్తులు తయారయ్యేవి. దీంతో, గోనె సంచుల కోసం దక్షిణ భారతదేశమే విజయనగరం వైపు తొంగి చూసేది. పాలకుల విధానాల వల్ల జ్యూట్ మిల్లులు దివాలా తీశాయి. జ్యూట్ ఉత్పత్తుల స్థానంలో పాలకులే ప్లాస్టిక్, మైకా వంటి ప్రత్యామ్నాయ ఉత్పత్తులు అందుబాటులోకి తేవడంతో, జ్యూట్ ఉత్పత్తులకు డిమాండ్ తగ్గింది. ముఖ్యంగా నార కొనుగోలుకు ప్రభుత్వం ఆసక్తి చూపకపోవడం వల్ల గోగు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోయింది. ప్రస్తుతం ఉమ్మడి విజయనగరం జిల్లాలో 5వేల ఎకరాల్లో సాగవుతున్నట్టు రికార్డుల్లో పేర్కొంటున్నప్పటికీ ఆచరణలో అంత కనిపించడం లేదని రైతు సంఘం అభిప్రాయపడుతోంది. ఫలితంగా జిల్లాలో తొమ్మిది జ్యూట్‌మిల్లులకు గాను ప్రస్తుతం బొబ్బిలి జ్యోతి, కొత్తవలసలో ఉమా జ్యూట్‌మిల్లు, నెల్లిమర్ల జూట్‌మిల్లు మాత్రమే నడుస్తున్నాయి. విజయనగరంలో రెండు, బొబ్బిలిలో రెండు, కొత్తవలసలో రెండు పరిశ్రమలు మూతపడ్డాయి. గోనె సంచుల తయారు చేసే నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు పదేళ్ల క్రితమే తిరోగమనంలోకి వెళ్లింది. సుమారు 5వేల మంది కార్మికులతో కళకళలాడేది. ప్రస్తుతం 1500 మంది మాత్రమే పనిచేస్తున్నారు. సాలూరు జ్యూట్‌మిల్లు ఎప్పటికప్పుడు మూతపడుతోంది. జ్యూట్ మిల్లుల్లో ఒకప్పుడు 25వేల మంది కార్మికులు పనిచేసేవారు. ప్రస్తుతం 2500 నుంచి 3వేల మంది మాత్రమే ఉన్నారు. మూతపడ్డ వాటిలో మూడు పరిశ్రమలు (విజయనగరంలోని అరుణా, ఈస్టుకోస్టు, బొబ్బిలిలోని శ్రీలక్ష్మీ శ్రీనివాస శాశ్వతంగా మూతపడ్డాయి. ఇవన్నీ ఇప్పటికే రియల్ ఎస్టేట్‌గా మారాయి. కొత్తవలసలోని రెండు ఉమా జ్యూట్‌మిల్లులు కొన ఊపిరితో వున్నాయి. ఈనేపథ్యంలో ఒకప్పుడు జ్యూట్ మిల్లుల్లో పనిచేస్తూ దర్జాగా బతికే కార్మికులు ప్రస్తుతం సెక్యూరిటీగార్డులుగాను, వలస కూలీలగాను మారిపోయారు. గోగు సాగుచేసే రైతులు క్రమంగా ఇతర పంటలకు మళ్లడం, వాటికి కూడా మార్కెట్ సదుపాయం లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవడం ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఇక గోనె సంచుల కొరత అక్కడి నుంచే ప్రారంభమైంది. దీన్ని అధిగమించేందుకు గోగు పంటలను ప్రోత్సహించేందుకు బదులు గోనె సంచుల గోలతో సరిపెడుతుండడం పట్ల జనం విస్తుపోతున్నారు.

భారత రాజ్యాంగం గొప్ప మార్గనిర్దేశం

పార్వతీపురం : ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఆర్ఒ వెంకటరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్

భారత రాజ్యాంగం దేశ పౌరులకు గొప్ప మార్గనిర్దేశమని డిఆర్ఒ జె.వెంకటరావు అన్నారు. రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం స్థానిక కలెక్టరేట్‌లో శనివారం ఘనంగా జరిగింది. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరులకు కొన్ని హక్కులు కల్పించడం ద్వారా స్వేచ్ఛగా మాట్లాడటం, సమాన న్యాయం పొందడం జరుగుతోందని చెప్పారు. భారతరత్న డాక్టర్ బాబూ సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ ముసాయిదా అధ్యక్షులుగా రూపొందిన రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగమని తెలిపారు. నిత్య జీవితంలో ప్రజలు ఏవిధంగా నడుచుకోవాలో స్పష్టమైన సూచన చేసిందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథ రావు, డిఆర్‌డిఎ, హౌసింగ్ పీడీలు పి.కిరణ్ కుమార్, రఘురాం, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా ఎంవిఆర్ కృష్ణాజీ, ఆర్.డబ్ల్యుఎస్ ఇఇ ఓ.ప్రభాకరరావు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టి బాబు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యాన

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థాని జనహిత డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్‌డిఒ కె.హేమలత భాతర రాజ్యాంగం చాలా గొప్పదని, అందులో పొందుపర్చిన అంశాలపై అవగాహన అవసరం అన్నారు. ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల వల్ల ఏర్పాటైన రాజ్యాంగంలో ప్రశ్నించడం కూడా ఒక హక్కుగా ఉందని, ప్రశ్నించడం వల్ల ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంఘం అధ్యక్షులు శివ కేశవరావు, కళాశాల కరస్పాండెంట్ పి.రామకష్ణ, జెవివి నాయకులు మౌళి, రంజిత్ కుమార్ విద్యార్థులు. పాల్గొన్నారు.

సీతానగరం : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలంలోని పెదభోగిల మేజర్ పంచాయతీ సర్పంచ్ జొన్నాడ తెరేజమ్మ , గరికయ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో స్థానిక యువత, పెద్దలు పాల్గొవడం జరిగినది. అలాగే మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, గ్రామ సచివాలయాల్లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.రేణుక, ఎస్సై కె.నీలకంఠం ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కృష్ణమహేష్‌రెడ్డి, తహశీల్దార్ ఎంవి రమణ, పంచాయితీ సర్పంచ్ కె.అరవింద్ కుమార్, ఇఒ వెంకటరమణ, జి.వెంకటరమణ, ఇఒపిఆర్‌డి కెకె వర్మ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : స్థానిక ప్రధాన రహదారిపై గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ ఇందుపూరు గున్నేశ్వరరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మూడు మండలాల వైసిపి అధ్యక్షులు బొమ్మి రమేష్, బొంగు చిట్టి రాజు, పాలవలస మురళీకృష్ణ, ఎంపిపిలు, వైస్ ఎంపిపిలు, స్టేట్ డైరెక్టర్లు, ఎఎంసి డైరెక్టర్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్లు, ఎంపిటిసి సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

కురుపాం : రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని శనివారం స్థానిక బాపూజీ గురుకుల పాఠశాల సిబ్బంది విద్యార్థులు తో పాఠశాల నుండి బస్టాండ్ వరకు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కు జేజేలు పలుకుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల కమిటీ చైర్మన్ కిమిడి భూషణరావు పాల్గొన్నారు.

సాలూరు:భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలంలోని కరాసువలసలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల హెచ్ ఎం ముత్యాలు, ఉపాధ్యాయులు ఎస్.సింహాచలం ఆధ్వర్యాన విద్యార్థులు ర్యాలీ చేశారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు రాజ్యాంగం గురించి వివరించారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పిఒ బి.నవ్య బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ కృషి ఫలితమే నేడు మనం జీవిస్తున్న స్వేచ్ఛాయుత జీవితమన్నారు. అనంతరం ఐటిడిఎ అధికారులు, సిబ్బందిచే భారత రాజ్యాంగంలోని ప్రవేశిక ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, ఏవో విజయరాణి, పీఏవో హరికష్ణ, ఓఎస్డీ ఎడ్యుకేషన్ యుగంధర్, వైకేపీ ఏపీడీ నారాయణరావు, ఏటీడబ్ల్యువో మంగవేణి, పీఎమ్మార్సీ సిబ్బంది, ఇతర ఐటిడిఎ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఐటిఐ ఆవరణలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగం విశిష్టతను విద్యార్థులకు ప్రిన్సిపల్ టివి గిరి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ : దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఏలాం జంక్షన్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు .కార్యక్రమంలో ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నూతలపాటి భరత్‌భూషణ్, డివిజన్ గౌరవ అధ్యక్షులు యమ్మల సతీష్‌కుమార్, వైసిపి పట్టణ కన్వీనర్ వెలమల మన్మధరావు, బత్తిన మోహనరావు, రవికుమార్, రమేష్, భోగి విశ్వేశ్వరరావు తదితరులున్నారు.

ఓని పాఠశాలలలో.....

మండలంలోని ఓని ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం గంగు మోహనరావు, ఉపాధ్యాయులు గోగుల సూర్యనారాయణ, ఉమామహేశ్వరి, చిన్నారావు తదితరులున్నారు.

డిగ్రీకళాశాలలో....

స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో భారతరాజ్యాంగ దినోత్సవం ప్రిన్సిపల్ డి.జనార్ధన్‌నాయుడు అధ్యక్షతన జరిగింది. ఎబిపి చందక జగదీష్ రాజ్యాంగం గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ డైరెక్టర్ నెల్లి శివప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ ప్రభాకరరావు, రాజు, జయమణి తదితరులున్నారు.

గుమ్మలక్ష్మీపురం: మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి

భామిని: మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్న విద్యార్థులు

వీరఘట్టం: అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేస్తున్న జెడ్‌పిటిసి కన్నతల్లి

పార్వతీపురంరూరల్ : స్థానిక మండల కార్యాలయంలోని సమావేశ భవనంలో ఐఆర్‌పిడబ్యూ స్వంచ్ఛంధ సంస్థ అధ్వర్యంలో శనివారం రాజ్యాంగ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి టిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, ఐఆర్ఎస్ అధికారి రవికిరణ్‌యాదర్, నరవ ప్రకాష్ హాజరై యువతకు రాజ్యాంగ హక్కులపై అవగాహన కల్పించారు.

జియ్యమ్మవలస : మండలంలోని బిజె పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగంపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. దేశ నాయకుల, రాజ్యాంగ నిర్మాతల వేషధారణలతో పిల్లలు అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు ,పెద్దలు పాల్గొన్నారు.

భామిని: స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అక్కివరపు సరసయ్య, భీమపల్లి ముత్యాలు, కిల్లు సూరిబాబు, ఆర్. సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

వీరఘట్టం: కత్తుల కవిటి గ్రామంలో జడ్‌పిటిసి జంపు కన్నతల్లి, ఉమామహేశ్వరావులు బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలువురిని ఆకట్టుకునే విధంగా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కొత్తవలస పరిమిల, సర్పంచి గేదెల సరోజిని, సచివాలయ కార్యదర్శి రాము, ప్రధాన ఉపాధ్యాయులు ఉప్పాడ అప్పారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బలిజిపేట : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం కళాశాల విద్యార్థులు రంగు రంగుల ఇటుకలతో రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంఘటనా మండల ప్రజలను ఆకర్షించి విద్యార్థులను అభినందించారు.

గుమ్మలక్ష్మీపురం: స్థానిక శాఖ గ్రంథాలయంలో జరిగిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో స్థానిక సర్పంచ్ బి. గౌరీ శంకర్రావు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు జి. హరి ప్రసాదరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబాబు, గ్రంథాలయ అధికారినీ సుకన్య, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బి.మురళీధర్ రావు, మహిళ పోలీస్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రవచనకు ఆర్థికసాయం

బలిజిపేట : మండలంలో మిర్తివలసకు చెందిన మనం సైతం యూత్ అనారోగ్యంతో బాధపడుతున్న ప్రవచనకు రూ.4700 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మజ్జి గణేష్, సుధీర్, శ్రావణ్, భాస్కర్ పాల్గొన్నారు. మానవతా దృక్పథంతో సాయం చేసిన మనం సైతం గ్రూపు యువతకు నేతాజీ గ్రంథాలయం స్థాపకులు ఈర్ల సంజీవనాయుడు ధన్యవాదములు తెలిపారు.

మాట్లాడుతున్న ఎంపిపి శెట్టి పద్మావతి

మండల పరిషత్ బడ్జెట్ సమావేశం

కురుపాం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం 2022-23 సవరణ బడ్జెట్, 2023-24 అంచనా బడ్జెట్ ఎంపిపి శెట్టి పద్మావతి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ వివి శివరామప్ప విద్య, మహిళా, సంక్షేమం, నీటి సరఫరా, ఎస్‌సి, ఎస్‌టి, సామాజిక భద్రత, సంక్షేమం, పెన్షన్లు, ఉపాధిహామీ, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు ఇంతవరకు ఖర్చు పెట్టిన బడ్జెట్ రూ.48 కోట్ల 8 లక్షల 97 వేలు కాగా రానున్న సంవత్సరానికి రూ.60 కోట్ల 15 లక్షల 84 వేల అవసరమైనట్లు అంచనా బడ్జెట్‌ను చదివి వినిపించారు. ఈ బడ్జెట్‌ను సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు బి.అన్నాజీరావు, ఎ.రంగారావు, పలువురు ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

సీతానగరం : జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని ఎంపిడిఒ బి.కృష్ణ మహేష్ రెడ్డి అన్నారు. మండలంలోని చల్లమనాయుడువలస, కృష్ణరాయపురంలో శనివారం లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు ఎటువంటి సహకారం కావాలన్నా ప్రభుత్వ పరంగా అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతి లబ్ధిదారుడు ముందుగా ఇల్లు నిర్మాణానికి పునాదులు కట్టడం ప్రారంభించాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ సిహెచ్.జానకీరాం, వర్క్ఇన్‌స్పెక్టర్లు, సర్పంచులు జి.అన్నం నాయుడు, వి.పారమ్మ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు

గ్రీన్ అంబాసిడర్ల జీతాల చెల్లింపునకు చర్యలు

సీతానగరం : మండలంలోని గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇఒపిఆర్‌డి కెకె వర్మ తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి పంచాయతీల ద్వారా రెండు, మూడు నెలల జీతాలు చెల్లింపులు చేయాలని పంచాయతీలకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఇప్పటివరకు 35 పంచాయతీలకు 15 పంచాయితీల్లో జీతాలు చెల్లించేందుకు నిధులు కేటాయించినట్లు ఆయన తెలిపారు.

ఇంటి పన్నుల వసూలు తప్పనిసరి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం : గ్రామాల్లో తప్పనిసరిగా ఇంటి పన్నులు వసూలు చేయాలని ఎంపి డిఒ బి.కృష్ణమహేశ్ రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో శనివారం పంచాయతీ కార్యదర్శు లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి ఇచ్చే లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి పన్నులు వసూలు చేయాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా కార్యదర్శులు అందుబాటులో ఉండాలని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, మంచినీటి సమస్యలపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానాలను నివారించాలి

సీతానగరం : రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్ఐ కె.నీలకంతం తెలిపారు. మండలంలోని అప్పయ్యపేట జంక్షన్‌లో శనివారం ప్రయాణికులతోనూ, ఆటో డ్రైవర్లతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ వాహనాలపై ప్రయాణించే ప్రయాణికులు తప్పక హెల్మెట్ ధరించాలని, ప్రతి ఒక్కరికీ లైసెన్స్ ఉండాలని సూచించారు. ఆటో డ్రైవర్లు పరిమితి మించిన ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని, ప్రభుత్వ నిబంధన మేరకే వాహనాలు నడపాలని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు

పోలమాంబను దర్శించుకున్న జడ్జి

మక్కువ : మండలంలోని శంబరలో గల పోలమాంబ అమ్మవారిని సాలూరు జుడీషియల్ మెజిస్ట్రేట్ కె.రమేష్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్, ధర్మకర్తలు ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. అమ్మవారి కానుకలు, ఆశీర్వచనాలు ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి నగేష్ పాల్గొన్నారు.

ప్రధాన రహదారి బాగు చేయండి

కలెక్టరేట్ : పట్టణ ప్రధాన రహదారులైన బెలగాం చివర నుండి రాయగడ రోడ్డు చివర వరకు, రోడ్లన్నీ పాడైపోయాయని, తక్షణమే వీటిని మరమ్మతు చేపట్టాలని సిపిఎం నాయకులు జి.వెంకటరమణ, పాకల సన్యాసిరావు ఆర్అండ్‌బి ఇఇ జేమ్‌ను కోరారు. ఈ మేరకు శనివారం ఇఇకి వినతిని అందజేశారు. అనంతరం మారు మాట్లాడుతూ పాత బస్టాండ్ నుంచి, కొత్తవలస చివరి వరకు రోడ్లన్నీ గుంతలతో పాడైపోయినవని, వాహనదారులు పాదచారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల వాహనదారులు, పాదాచారులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలు సందర్భాల్లో ప్రమాదాలు జరిగిన సమయంలో తాత్కాలిక ఉపశమనం కోసం పాత బస్టాండ్ ప్రాంతంలో క్రషర్ బుగ్గి వేయడంతో వాహనాల రాకపోకల సమయంలో ఆ గాలికి దూలి ఎగిరి నివాస ప్రాంతాల్లో పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున శాశ్వత ప్రాతిపదికన రోడ్లు బాగు చేయాలని కోరారు. దీనికి ఇఇ స్పందిస్తూ పది రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.


ఆర్అండ్‌బి ఇఇకు వినతినిస్తున్న సిపిఎం నాయకులు

జీడి తోటల్లో ప్రకృతి వ్యవసాయం ప్రయోగం

ప్రజాశక్తి - పాచిపెంట

జీడి తోటల్లో డిసెంబర్ నుంచి టీ దోమ ఆశించి పూత మొత్తం రాలిపోయి ఒక్క చెట్టుకు కనీసం ఒక కేజీ జీడి పిక్కలు కూడా రాని పరిస్థితి గత రెండేళ్లుగా ఉందని, కావున రైతులు ఇప్పటి నుంచే జాగ్రత్త వహిస్తే తప్పనిసరిగా మంచి దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని కంకణ పల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన రైతు సమావేశంలో మాట్లాడుతూ జీడి తోటల్లో మగ, ఆడ పుష్పాలతో పాటుగా ద్విలింగ పుష్పాలు కూడా ఉంటాయన్నారు. ఫలదీకరణం చెందాలంటే కీటకాల సహాయం చాలా అవసరమని కానీ ఈ దశలోనే టీ దోమ తేనెమంచు పురుగు వంటి వాటి నివారణకు రైతులు రసాయ నాలు వాడుతున్నారని వీటి వలన ఫలదీకరణకు ఉపయోగపడే కీటకాలు కూడా చనిపోతున్నాయని తెలిపారు. కావున ప్రకృతి సేద్య పద్ధతులు ద్వారా జీడి తోటలలో దిగుబడును గణనీయంగా పెంచుకోవచ్చని వ్యవసాయ అధికారి తెలిపారు. ప్రకతి సేద్య ప్రతినిధులు మాట్లాడుతూ జీడి తోటలు ఉన్న రైతులకు కషాయాలను సిద్ధం చేసి ఉంచుతామని, తప్పకుండా పిచికారి చేసుకోవాలని సూచించారు.

రైతులతో మాట్లాడుతున్న ఎం తిరుపతిరావు

విగ్రహాలను పునరుద్ధరించాల్సిందే..

కురుపాం : గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర సమీపా కొండ పోరంబోకు స్థలంలో గల జీసస్, మేరీ మాత విగ్రహాలను రెవెన్యూ అధికారులు తొలగించడం అన్యాయమని సిపిఎం నాయకులు బివి రమణ అన్నారు. ఈ మేరకు శనివారం గరుగుబిల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద దళితులు, క్రైస్తవులతో కలిసి ధర్నా నిర్వహించి అనంతరం డిటికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లిభద్ర రెవెన్యూ పరిధిలోని కొండపోరంబోకు స్థలంలో పదేళ్లుగా దివ్య కారుణ్య పుణ్య క్షేత్రం ఏర్పాటు చేసుకుని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఆ ప్రాంత అభివృద్ధికి గరుగుబిల్లి, పార్వతీపురం, కొమరాడ, వీరఘట్టం మండలాలతో సహా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు లక్షలాది రూపాయలు చందాల రూపంలో వసూలు చేసుకుని ఆ ప్రాంతాన్ని అభివద్ధి చేశారన్నారు. ఈ కార్యక్రమాలు అన్నింటిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు కూడా భాగస్వాములయ్యారని అంతటి పుణ్యక్షేత్రంగా వెలిసినటువంటి ఆ ప్రాంతాన్ని రెవెన్యూ అధికారులు ధ్వంసం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు తమ నిర్ణయాన్ని పునరాలోచించుకొని ఈ స్థలంలో పూజా కార్యక్రమాలు యధావిధిగా నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించాలని అధికారులకు కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో బొండపల్లి ప్రసాదరావు. బోనెల వెంకటి, గొర్లి దాసు, అర్లప్ప, పాల్గొన్నారు

'రాజులతో తిరిగితే ఎలా కలిసివెళ్తాం?'

కురుపాం : రాజులతో కలిసి వెళ్లే టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి జగదీశ్వరితో తామెలా కలిసి వెళ్తామని టిడిపి ఆశావాహులు పి.లావణ్య, బి. పద్మావతి అన్నారు. శనివారం కురుపాం టిడిపి కార్యాలయం వద్ద పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం జగదీశ్వరి విలేకర్ల సమావేశంలో తనకు గిరిజనులే వెన్నుపోటు పొడుస్తున్నారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తనకు ఇన్ఛార్జి ప్రకటించినప్పటి నుంచి ఇంతవరకు కనీసం తమతో కలవడం గానీ సంప్రదించడం కానీ లేదని ఆమెకు కోటకు వెళ్లే సరికే సమయం సరిపోతుందని, విజయరామరాజు ఏమి చెప్తే తూచా తప్పకుండా ఆమె ఆదే పాటిస్తుందని విమర్శించారు. తాము ఆరుగురు ఆశావాహులు ఏకతాటిపై తిరుగుతూ ప్రతి గ్రామంలో టిడిపి బలోపేతానికి కృషి చేస్తు కోట రాజకీయాలకు దూరంగా ఉన్నామన్నారు. టిక్కెట్ వస్తే గిరిజన అభ్యర్థి గెలుపునకే తాము కృషి చేస్తామని తమపై అనవసరమైన అసత్య ఆరోపణలు చేసి వెన్నుపోటు దారులు అనడం సమంజసం కాదని హితవు పలికారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు సువ్వాన గోవింద నాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కౌశల్‌కు క్విజ్ పోటీలలో ప్రథమ స్థానం

గుమ్మలక్ష్మీపురం : జిల్లా స్థాయి కౌశల్ క్విజ్ పోటీలలో గుమ్మలక్ష్మీపురం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన ఎస్ మనస్విని ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సిహెచ్ శ్రీరంజిని పాఠశాల ఉపాధ్యాయులు శనివారం పాఠశాలలో ప్రథమ స్థానం సాధించిన మనస్వినికి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీరంజిని మాట్లాడుతూ ఉపాధ్యాయులు రజని ఆధ్వర్యంలో విద్యార్థిని శిక్షణ పొందిందని జిల్లా స్థాయిలో గెలుచుకొని డిసెంబర్ 9న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని అన్నారు.

లబ్ధిదారులకు బిల్లులు అందజేయండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పలనాయుడు హౌసింగ్ శాఖ అధికారులతో అన్నారు. హౌసింగ్ డేను పురస్కరించుకొని శనివారం మండలంలో ఉన్న హెచ్ కారాడ వలసలో జగనన్న లే అవుట్‌లో వివిధ దశలలో జరుగుతున్న గృహ నిర్మాణాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇల్లు లేని పేదలకు సొంత ఇల్లు నిర్మించుకునే విధంగా చర్యలు చేపట్టిందన్నారు. ఎవరికి కేటాయించిన స్థలంలో వారే గృహ నిర్మాణం చేసుకోవాలని వేరొక స్థలంలో నిర్మాణాలు చేయకూడదని హెచ్చరించారు. ఇటీవల ఒకరి స్థలంలో వేరొకరు పునాదులు స్థాయిలో నిర్మించడంతో, జరిగిన పనులకు సంబంధించిన నిర్మాణ వ్యయంను నిర్మాణం చేసిన వారికి లబ్ధిదారులు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని హౌసింగ్ అధికారులను సూచించారు. ఇంకా ప్రారంభం కానీ నిర్మాణాలను త్వరతగతిన ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి శనివారమూ ఇంటి నిర్మాణాలను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయాల ఇమ్యూనిటి సెక్రటరీలు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న కమిషనర్

పనులకు శంకుస్థాపన

పార్వతీపురం టౌన్ : పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో 23వ వార్డులో లింగం వీధిలో గల ప్రాథమిక పాఠశాలలో శనివారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు, మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, స్థానిక కౌన్సిల్ సభ్యులు మంత్రి ఉమామహేశ్వరితో కలిసి రూ.12 లక్షలతో నాడు - నేడు అభివృద్ధి పనులకి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు..

ధాన్యం కొనుగోలు పై శిక్షణ

భామిని : మండల వ్యవసాయాధికారి కె. సింహాచలం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు పై భామిని రైతు భరోసా కేంద్రంలో శనివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు పొలాలు, కల్లాలు నుండి ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు పాటించవలసిన నిబంధనలు, పరిశీలించవలసిన నాణ్యత ప్రమాణాలు, వారి బాధ్యతలు గురుంచి సివిల్ సప్లై సాంకేతిక సహాయకులు చిన్ని కృష్ణ, విశాలక్షి, కళ్యాణ్‌లు గ్రామీణ వ్యవసాయ సహాయకులు, సాంకేతిక సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటరలుకు వివరించారు. ధాన్యం కొనుగోలు సక్రమంగా జరిగేలా ప్రతీ ఒక్కరూ జాగ్రత్త వహించాలన్నారు. వరి కోతలు తరుణంలో రైతులకు అందుబాటులో ఉండాలని వ్యవసాయాధికారి తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

సాలూరు : యువకులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు వుంటుందని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ జర్జాపు దీప్తి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి జగనన్న క్రీడా సంబరాలను ఆమె వైస్ చైర్మన్ వంగపండు అప్పల నాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక శారీరక ఉల్లాసానికి దోహదపడతాయని చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటా వుంటుందని చెప్పారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. వాలీబాల్, కబడ్డీ క్రీడల్లో పురుషులు బాలికలు, క్రికెట్‌లో పురుషులు పాల్గొన్నారు. మొత్తం 250మంది క్రీడాకారులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నామని చెప్పారు.

పోటీలను ప్రారంభిస్తున్న వైస్‌చైర్‌పర్సన్ దీప్తి

8న భాషా వాలంటీర్ల భిక్షాటన

సీతంపేట : సవర భాష విద్యా వాలంటీర్లు నాలుగు నెలల జీతాలు చెల్లించాలని ఈనెల 28న భిక్షాటన చేస్తారని గిరిజన సంఘం నాయకులు బిడ్డిక అప్పారావు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సవర భాష విద్యా వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు మండలాల నుండి 150 మంది వాలంటీర్లకు నాలుగు నెలలు జీతాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికే పలుమార్లు స్పందనలో వినతులు సమర్పించిన పట్టించుకోవడంలేదని అన్నారు. అందుకే సవరభాష విద్యా వాలంటీర్లు ఐటిడిఎ ముఖ ద్వారం వద్ద బిక్షాటన కార్యక్రమం సోమవారం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సవర భాష వాలంటీర్ల రాష్ట్ర కార్యదర్శి సవర డొంబురాజు, ఎల్లంగో తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బిడ్డిక అప్పారావు

అన్నదానం చేస్తున్న కృష్ణ అభిమానులు

నటశేఖర కృష్ణకు ఘననివాళి

పాలకొండ : సినీనటుడు నటశేఖర కృష్ణ పెదకర్మ సందర్భంగా శనివారం పట్టణంలో పోస్టాఫీస్ రోడ్డులో కృష్ణ అభిమానులు ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా అన్నదానం చేపట్టారు. కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఆయన లేనిలోటు సినీపరిశ్రమకు తీరనిదన్నారు. కార్యక్రమంలో కడగల రమణ, గొన్నాభత్తుల కృష్ణ, కోడెం విజయ్‌కుమార్ తదితరులున్నారు

బియ్యం వితరణ

సీతంపేట: మండలంలోని పులిపుట్టిలో గల యువమిత్ర సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మ బాలల అనాధ శరణాలయానికి శ్రీకాకుళం జై ఆంధ్ర సమాచారం చట్టం కోర్ కమిటీ సభ్యులు అసిస్టెంట్ డైరెక్టర్ ధనుంజరావు అనాధ చిన్నారులకు, వృద్ధులకు శనివారం బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో ఇటువంటి శరణాలయం సేవా దృక్పథంతో నిర్వహించడం గొప్ప విషయం అని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గొర్లె గడ్డియ్య, అధ్యక్షులు గొర్లె సుజాత, కోఆర్డినేటర్ అప్పల నరసమ్మ పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

వీరఘట్టం : పాలకొండ, సీతంపేట, వీరఘట్టం మండలాల్లోనే పలువురు శనివారం జనసేన పార్టీ పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్, పాలవలస యశస్విని ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. గతంలో పిఆర్‌పిలో పనిచేసిన వీరంతా జనసేన పార్టీ ప్రజా సమస్యలపై పోరాడుతున్న తీరుకు ఆకర్శితులై పార్టీలో చేరినట్లు మాజీ పిఆర్‌పి నాయకులు కర్రి కళ్యాణి, కిమిడి సురేష్, పి శంకర్, ఎస్ సింహాద్రి, గణేష్, రాజేష్, దిలీప్, పొట్నూర రమేష్ తెలిపారు

వాహనదారులకు అవగాహన

సాలూరు రూరల్ : మండలంలోని బొడ్డవలస వద్ద శనివారం ద్విచక్ర వాహనదారులకు సాలూరు రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని చెప్పారు. బండికి సంబంధించిన అన్ని పత్రాలూ ఉంచుకోవాలన్నారు. సాలూరు రూరల్ స్టేషన్ పరిధిలో గతంలో అక్రమంగా తరలిస్తున్న సారాయితో పట్టుబడ్డ 7 ద్విచక్ర వాహనాలు, ఒక తిచక్ర వాహనాన్ని ఈనెల 29న సాలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో వేలాం వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, ద్విచక్ర వాహనదారులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి యాప్‌లపై శిక్షణ

కలెక్టరేట్ : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కొత్తగా ప్రవేశపెట్టిన యాప్‌లు, హెల్త్ స్క్రీనింగ్ అంశాల పై జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు డిఎంహెచ్ఒ డాక్టర్ బి.జగన్నాధరావు తెలిపారు. ఇందుకు సంబంధించి జిల్లా నోడల్ అధికారి నాగేశ్వర రావు సందర్శించి ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఆయా పిహెచ్‌సిల్లో పర్యవేక్షించారన్నారు. ఈ శిక్షణలో గిరిజన వసతి గృహ విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్, ఆరోగ్యశ్రీ నెట్వర్క్, ఆసుపత్రుల ఫెసిలిటేషన్ యాప్, ఎన్‌సిడి రివ్యూ, అన్మోల్ యాప్, లెప్రసి డిటెక్షన్ యాప్, చిన్న పిల్లల్లో న్యూమోనియా లక్షణాలు గుర్తించే నమూనా యాప్‌లున్నాయన్నారు. ఆర్‌బిఎస్‌కె జిల్లా సమన్వయాధికారి డి.బాస్కరరావు, డిఐఒ జగన్మోహనరావు, డిప్యూటీ డిఎమ్‌హెచ్ఒ దుర్గా కళ్యాణి, డాక్టర్ వినోద్ ఈ శిక్షణను పర్యవేక్షించారు.